క్లుప్తంగా

కిటికీ నుంచి తొంగి చూస్తున్నాడని ఫిర్యాదు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెంకటాయపాలేనికి చెందిన నేదునూరి సుబ్బారావు తన ఇంటి పక్క వ్యక్తి కిటికీలో నుంచి తొంగి చూస్తున్నాడని ఫిర్యాదు చేయడంతో ద్రాక్షారామ హెడ్ కానిస్టేబుల్ బి.సూర్యనారాయణ కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 14న సోమవారం రాత్రి తన ఇంటిలో భార్య, కుమారుడు, కుమార్తెలతో కలసి నిద్రపోతుండగా ఇంటి పక్కనే నివాసం ఉంటున్న ముమ్మిడివరపు సందీప్ తేజ అర్ధరాత్రి 11.30 గంటల సమయంలో కిటికీలో నుంచి లైట్ వేసి చూస్తుండగా భార్యకు మెళకువ వచ్చి భర్తకు విషయం చెప్పడంతో అతడు వెళ్లి పట్టుకున్నాడు. అయితే సందీప్ అతడిని గెంటి పారిపోతూ నీ అంతు చూస్తానని బెదిరించినట్లు విషయం పెద్దలకు తెలియజేసి గతంలోనూ తన ఇంటిలో దొంగతనం జరిగి ఉండటంతో ద్రాక్షారామ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ విలేకరులకు తెలిపారు.

తాగునీటి ఇబ్బందులపై చర్యలు చేపట్టాలి

కాజులూరు: వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని రామచంద్రపురం నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ దూడల శంకరనారాయణ అన్నారు. కరప, కాజులూరు మండలాల్లో 24 గ్రామాలకు తాగు నీరందించే గొల్లపాలెం భారీ రక్షిత మంచినీటి పథకాన్ని మంగళవారం శంకరనారాయణ తదితర బీజేపీ నేతలు సందర్శించి నీటి నిల్వలు, క్లోరినేషన్, ఫిల్టర్‌బెడ్లు నిర్వహణని తదితర విషయాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మెరుగైన తాగునీటి సరఫరా కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రూ.కోట్ల నిధులు విడుదల చేస్తుందన్నారు. అధికారులు వాటిని సద్వినియోగం చేసుకుంటూ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. మండల బీజేపీ అధ్యక్షుడు పుణ్యమంతుల శివాజీ, పార్టీ నేషనల్ కౌన్సిల్ సభ్యుడు రొక్కాల సత్తిబాబు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి రామకృష్ణ యువజన విభాగం అధ్యక్షుడు నిమ్మన రాజేష్, దేవు పట్టాబి, పోలిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగాత్మక విద్యతో ప్రగతి బాట



అంగర సబ్ స్టేషన్‌లో ఫీడర్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు

కపిలేశ్వరపురం: తరగతి గదిలో చదువుకున్న అంశాలను క్షేత్ర స్థాయిలో ప్రయోగాత్మకంగా విశ్లేషించుకోవడం ద్వారా విద్యార్థులు ప్రగతి బాట పట్టొచ్చని జిల్లా బాలికా విద్య అభివృద్ధి అధికారి ఎంకే భీమారావు అన్నారు. పాఠశాల పదో తరగతి విద్యార్థులు మంగళవారం ఇంటర్న్‌షిప్ పేరుతో క్షేత్ర పరిశీలన ప్రక్రియలో భాగంగా అంగర సబ్‌స్టేషన్, చేనేత మగ్గాలను సందర్శించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ, ఈ ఏడాది మార్చి 29న నిర్వహించిన వృత్తి విద్యా శిక్షణకు పాఠశాల వృత్తి విద్యా శిక్షకురాలు టి.లలిత, ఎస్.శ్రీనుబాబు పర్యవేక్షణలో 12 రోజుల పాటు పదో తరగతి విద్యార్థులు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రమాదేవి, జిల్లా వృత్తి విద్యా కో–ఆర్డినేటర్ కె.రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏపీ బీఎస్ఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శిగా శ్రీదేవి



బాధ్యతలు చేపడుతున్న శ్రీదేవి

రాయవరం: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని వెదురుపాకకు చెందిన కె.శ్రీదేవి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ విషయాన్ని ఆమె స్థానిక విలేకరులకు తెలిపారు. ఏలూరులో జరిగిన సమావేశంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించినట్లు ఆమె తెలిపారు. పేద బ్రాహ్మణుల సంక్షేమానికి, వారి అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానన్నారు.

బాలికపై అసభ్య ప్రవర్తనతో పోక్సో కేసు

రాయవరం: బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై ఎస్సై డి.సురేష్‌బాబు మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. రాయవరం గ్రామానికి చెందిన తేతల శ్రీనివాసరెడ్డి అదే గ్రామానికి చెందిన 11 ఏళ్ల బాలికపై అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక ఏడుస్తూ తన తల్లికి విషయం చెప్పడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు.

కనుచూపు మేర కళ్లాలే..

- రహదారులపై కుప్పలుగా పోసిన ధాన్యం
- తేమ శాతం తగ్గించేందుకు ఆరబోత
- యంత్రాలతో వరి కోతలే కారణం!



పసలపూడి-పామర్రు ప్రధాన రహదారిలో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

రాయవరం: ఏ రహదారి చూసినా ధాన్యం కళ్లాలుగా మారాయి. ఒకప్పుడు వరి పొలాల్లో కళ్లాలు చేసుకుని, ధాన్యం నూర్పిళ్లు చేస్తే.. ఇప్పుడు మారిన పరిస్థితుల దృష్ట్యా రహదారులపై ధాన్యాన్ని ఆరబెట్టుకోవాల్సిన పరిస్థితి అన్నదాతలకు ఎదురవుతోంది. కుప్ప నూర్పిళ్లు చేసిన అనంతరం ధాన్యాన్ని రైతులు అమ్ముకోవడం, హెచ్చు ధర కోసం గాదుల్లో పోసుకోవడం వంటివి రైతులు చేసుకునేవారు. ఇప్పుడు రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకున్న తర్వాతే.. ఏ పనైనా చేయాల్సి వస్తుంది. యంత్రాలతో వరి కోతలు చేపట్టడమే ఇందుకు ప్రధాన కారణం. యంత్రాలతో వరి కోతలు చేపట్టడం వల్ల ధాన్యంలో తేమ శాతం అధికంగా ఉండడంతో, రైతులు ప్రస్తుతం ఆ ధాన్యాన్ని ఆరబెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు.

95 శాతం యంత్రాలతోనే..

సాధారణ పద్ధతిలో రైతులు వరి కోతలు కోసి, కట్టేతలు కట్టిన వరి పనలను కుప్పలుగా వేసేవారు. కుప్పలు వేసిన 15 నుంచి 30 రోజుల్లో కుప్పలు నూరుస్తారు. దీనివల్ల తేమ శాతం బాగా తగ్గుతుంది. ప్రస్తుత కాలంలో రైతులంతా పూర్తిగా యాంత్రీకరణ వైపు మొగ్గుచూపడంతో యంత్రాలతోనే వరి కోతలు కోస్తున్నారు. దీనివల్ల కోత కోసిన వెంటనే పచ్చి ధాన్యం వస్తుంది. పచ్చి ధాన్యంలో తేమ శాతం అధికంగా ఉంటుంది. ఇలాంటి ధాన్యానికి ధర అంతగా రాదు. ధాన్యంలో తేమ 17 శాతం కన్నా తక్కువగా ఉంటేనే ఆశించిన మేరకు ధర రావచ్చు. అందుకే రైతులు ప్రస్తుతం తమ ధాన్యాన్ని ఆరబెట్టుకునే పనిలో పడ్డారు. 95 శాతం పైగా వరి కోతలు యంత్రాలపైనే సాగాయి. దీంతో వీధులు, రహదారులే కాదు.. పొలాల్లో కూడా రైతులు ధాన్యాన్ని ఆరబెడుతున్నారు.

ముమ్మరంగా వరికోతలు

క్లస్టర్ పరిధిలోని మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో రబీ వరికోతలను రైతులు చేపట్టారు. మొత్తం 1.01 లక్షల ఎకరాల్లో సాగు చేపట్టగా, ఇప్పటికీ 30 శాతం కోతలు పూర్తయ్యాయి. యంత్రాలతో వరి కోతలు కోస్తున్నందున ఎండవేడి అధికంగా ఉండడంతో, రాత్రి సమయంలో కూడా యంత్రాలతో వరి కోతలు చేస్తున్నారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలించడంతో రైతులు వరికోతలను త్వరితగతిన చేపడుతున్నారు. రెండు రోజులుగా వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా సాయంత్రం సమయంలో గాలివానలు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. సాధారణ పద్ధతిలో కేవలం ఐదు శాతం మాత్రమే కోస్తుండగా, 95 శాతం మేర యంత్రాలపై వరికోతలు సాగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. యంత్రాలపై వరి కోతలు కోసిన రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుని, అమ్ముకునే పనిలో ఉన్నారు.

పని సులువవుతోంది



యంత్రాలపై వరికోతల కారణంగా పని సులువవుతోంది. కూలీలు దొరక్కపోవడంతో యంత్రాలను ఆశ్రయిస్తున్నాం. తేమ శాతం తగ్గించుకోవడానికి ఆరబెట్టాల్సి వస్తోంది. అయినా తప్పట్లేదు. కూలి రేట్లు కూడా అధికంగా ఉన్నాయి.

– కొవ్వూరి వెంకటరెడ్డి, రైతు, పసలపూడి, రాయవరం మండలం

యంత్రాలతో కోతలకే ప్రాధాన్యం



రైతులు యంత్రాలపై వరి కోతలకే ప్రాధాన్యమిస్తున్నారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు, కూలీల కొరత కారణంగా యంత్రాలతోనే కోతలను చేపడుతున్నారు. అధిక శాతం మంది రైతులు యంత్రాల సాయంతో వరికోతలు కోస్తున్నారు.

– కె.ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

పాఠశాలకు కంప్యూటర్ వితరణ



కపిలేశ్వరపురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు కంప్యూటర్ కం ప్రింటర్‌ను అందజేస్తున్న దాత సోమశేఖరం

కపిలేశ్వరపురం: పదో తరగతి 1975–75 బ్యాచ్ పూర్వ విద్యార్థి, అంగర గ్రామానికి చెందిన మాజీ ఆంధ్ర రాష్ట్ర పశు సంవర్ధక శాఖ సంచాలకుడు గుత్తుల సోమశేఖరం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు రూ.60 వేల విలువైన కంప్యూటర్ కం ప్రింటర్‌ను అందజేశారు. ఇటీవల పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించగా, కంప్యూటర్‌ను సమకూరుస్తానని ఆయన ప్రకటించారు. ఆ మేరకు ఆయన తల్లిదండ్రులు గుత్తుల కృష్ణమూర్తి, సుబ్బలక్ష్మి, సోదరుడు గుత్తుల శ్రీనివాస్ జ్ఞాపకార్థం మంగళవారం కంప్యూటర్ కం ప్రింటర్‌ను అందజేశారు. ఆయన మాట్లాడుతూ తామంతా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని జీవితాల్లో స్థిరపడ్డామన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి తమ భవిష్యత్తుపై భరోసా, ఆసక్తితో చదవడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. దాత సోమశేఖరం దంపతులను ఎంఈఓ కె.తాతారావు, హెచ్ఎం వంగా శ్రీనివాస్, ఎస్ఎంసీ చైర్మన్ కొప్పిశెట్టి సతీష్ అభినందించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు కె.సత్యనారాయణ, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయాల వద్ద అన్న సమారాధనలు



ఆంజనేయస్వామి మందిరంలో అన్న ప్రసాదాన్ని వడ్డిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి తదితరులు

మండపేట: శ్రీరామ నవమి ముగింపు వేడుకల సందర్భంగా మంగళవారం పట్టణంలో సీతారాముల పేరిట అన్న సమారాధన కార్యక్రమాలు విరివిగా జరిగాయి. సైదిల్‌పేట రామాలయం వద్ద, కేపీ రోడ్డులో టైలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలోనూ అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక పార్థసారథి నగర్‌లో అభయాంజనేయ స్వామివారి తొలి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మందిర వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం జరిగింది. టైలర్ల సంఘం, ఆంజనేయ స్వామివారి అన్నదానానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ (రాజబాబు) ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కౌన్సిలర్ నీలం దుర్గమ్మ సారథ్యంలో స్వాగతం పలకగా, స్వామివారిని దర్శించి అన్నదానాన్ని ప్రారంభించారు. సైదిల్‌పేట కాపుల రామాలయం వద్ద కమిటీ చైర్మన్ కర్రి వెంకటరమణ ఆధ్వర్యంలో 4 వేల మందికి అన్నదానం చేసినట్టు సభ్యులు తెలిపారు. అలాగే కేపీ రోడ్డులో 1,800 మందికి అన్నదాన ప్రసాద వితరణ చేశామని టైలర్ల సంఘ అధ్యక్షుడు రేకపల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి వింజరపు శ్రీనివాసరావు చెప్పారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ ఎర్నేని ప్రభావతి, నాయకులు పెంకే గంగాధర్, పిఠాపురం సత్యనారాయణ, తాడి రామారావు, దుగ్గిరాల రాంబాబు, పెంకే వెంకట్రావు, కమిటీ సభ్యులు ఈలి తాతాజీ, పిల్లి ఏడుకొండలు, చవ్వాకుల మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని ప్రభావితం చేసేవే రచనలు



మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో వనితా పురుష శతకాలు పుస్తకావిష్కరణ చేస్తున్న వైద్యులు

సఖినేటిపల్లి: రచనలు అంటే అక్షరాల కలయిక మాత్రమే కాదని, సమాజాన్ని ప్రభావితం చేసే శక్తివంతమైన సాధనం రచనలని ప్రముఖ కార్డియాలజిస్ట్ కేసీఎంఎల్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మోరి జాన సుబ్బమ్మ మెమోరియల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1986 పదో తరగతి విద్యార్థులు, వారి మిత్ర బృందం సహకారంతో ప్రముఖ సర్జన్ జాన వీరభద్రప్రసాద్ ఆలోచన విధానంతో మాజీ సర్పంచ్ జాన సత్యనారాయణ విజయలక్ష్మి జ్ఞాపకార్థం బహురూప వినియోగం నిమిత్తం నిర్మించిన ఓపెన్ ఆడిటోరియంను మరో మాజీ సర్పంచ్ జాన శంకరరావు(బాబ్జీ) ప్రారంభించారు. అలాగే ప్రముఖ తెలుగు పండిట్, కవి, కామవరపు మల్లికార్జునరావు (గౌరీమల్లిక్) రచించిన వనితాపురుష శతకములు(ద్విశతి) పుస్తకాన్ని వైద్యులు శ్రీనివాస్, వీరభద్రప్రసాద్ ఆవిష్కరించారు. గౌరీ మల్లిక్‌ను వైద్యులు సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ, మల్లిక్ మాస్టారు తన రచనల ద్వారా లోతైన దృక్పథంతో మరింత విజ్ఞానాన్ని సమాజానికి అందిస్తున్నారని ప్రశంసించారు. అనంతరం వైద్యులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. సర్పంచ్ పసలపూడి లక్ష్మీ పద్మమంగతాయారు, ఎంపీటీసీ జాన లక్ష్మీ దుర్గ సూర్యావతి, ఎస్ఎంసీ చైర్మన్ గుబ్బల శ్రీలక్ష్మి, ఎంఈఓ–2 మద్దాలి వెంకటేశ్వరరావు, హెచ్ఎం ఎస్.శ్రీధర్ కృష్ణ, పూర్వ విద్యార్థులు, వారి మిత్ర బృందం సభ్యులు పాల్గొన్నారు.

వరికోతలు వాయిదా వేసుకోవాలి



శివలలో రోడ్డు పక్కన ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ రంగారావు తదితరులు

కె.గంగవరం: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగా రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని రామచంద్రపురం సహాయ వ్యవసాయ సంచాలకుడు ఏవీఎస్ రంగారావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించి రైతులకు సూచనలు చేశారు. కాబోయే రెండు రోజులు కూడా వర్షం కురిసే అవకాశం ఉందని రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలన్నారు. ఇప్పటికే కోసిన ధాన్యం ఆరబెట్టడానికి సురక్షిత ప్రాంతంలో నిల్వ ఉంచుకోవాలని సూచించారు. ఈ రోజు నుంచి మండలంలో అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రం వద్ద ధాన్యం అమ్మకం కోసం నమోదు చేయించుకోవాలన్నారు. ఒకవేళ ధాన్యం తడిచిపోతే 5 శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేస్తే ధాన్యం మొలక రాకుండా నివారించవచ్చన్నారు. దీంతో పాటు రైతులందరూ తప్పనిసరిగా వేసవి పంట వేసుకోవాలని దానికి సంబంధించిన విత్తనాలు పిల్లి పెసర, జనుము, జీలుగ, నవధాన్యాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఏఓ సత్యప్రసాద్, వ్యవసాయ సహాయకులు పావని స్థానిక రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కరుణించని వరుణుడు

కె.గంగవరం: అకాల వర్షంతో రైతులు ఉరుకులు పరుగులు తీశారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను వర్షం నుంచి తప్పించడానికి నానాపాట్లు పడ్డారు. మండల వ్యాప్తంగా మంగళవారం ఈదురు గాలులతో కూడిన వర్షానికి పలు గ్రామాల్లోని ధాన్యం తడిచిపోయింది. విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. తామరపల్లి, యర్రపోతవరం, బాలాంత్రం, మసకపల్లి, కుడుపూరు, పాణింగపల్లి, కుందూరు, రాయిచెరువు, కె.గంగవరం, అద్దంపల్లి, భట్లపాలిక గ్రామాల్లో వర్షం పడడం వల్ల ఆరబెట్టిన ధాన్యం తడిచిపోయింది. ఆకాశం మేఘావృతం కావడంతో రైతులు ఉరుకులు పరుగుల మీద పొలాలకు వెళ్లి ధాన్యం రాశులపై బరకాలు కప్పి రక్షించుకున్నారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్న ఈ తరుణంలో వర్షం పడడం రైతులు కొంత వరకు నష్టపోయారు. మరో మూడు వారాల పాటు వాతావరణం అనుకూలిస్తే ఆరుగాలం శ్రమించిన పంట చేతికందుతుందని రైతులు ఆలోచిస్తున్నారు. కానీ వాతావరణం అనుకూలించకపోవడంతో పాటు రెండు రోజులు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో వారు ఆందోళన చెందుతున్నారు.



తామరపల్లిలో ధాన్యం రాశులపై బరకాలు కప్పుతున్న రైతులు

ఈ నెల 19న మోటార్ సైకిళ్ల వేలం

రాజోలు: ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన ఐదు మోటార్ సైకిళ్లకు ఈ నెల 19న వేలం నిర్వహిస్తామని రాజోలు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ కేవీ బాబ్జి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19న జరిగే వేలంలో పాల్గొనేవారు రూ.5 వేల ధరావత్తు సొమ్ము చెల్లించాలన్నారు. వివరాలకు 8374403689 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

రెండు ఆలయాల్లో మైక్‌సెట్‌ల దొంగతనం

రామచంద్రపురం రూరల్: మండలంలోని తాళ్లపొలం గ్రామంలో గ్రామం నుంచి ఆదివారపుపేటకు వెళ్లే దారిలో ఉన్న శివాలయం, కనకదుర్గ ఆలయాల్లో సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు బద్దలు కొట్టి రెండు ఆలయాల్లోని మైక్ సెట్లు, యాంప్లిఫైర్‌లు దొంగతనం చేసినట్లు ఆలయ కమిటీ పెద్దలు మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ మేరకు వారు ద్రాక్షారామ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.



తాళం పగులగొట్టి తలుపు గెడ వంచేసిన దొంగలు

హోరు గాలి.. జోరు వాన

- ఏడిదలో 45 ఎకరాల ధాన్యం నీటిపాలు
- రూరల్, అర్బన్‌లోనూ ఇదే పరిస్థితి
- కూలిన విద్యుత్ స్తంభాలు, చెట్లు



ఏడిదలో తడిసిన ధాన్యాన్ని రాశులు కడుతున్న రైతులు

మండపేట: ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యం రైతుల పాలిట శాపంగా మారింది. ఈ ఏడాది రబీ సీజన్‌లో వరి పంటలు కోత దశకు రావడంతో ఇబ్బడిముబ్బడిగా కోతలు మొదలయ్యాయి. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఆదరాబాదరాగా పనులు చక్కబెడుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం కురిసిన అకాల వర్షం రైతుల కంట కన్నీరు పెట్టించింది. గాలివాన బీభత్సం సృష్టించి మూడు రోజులు కాకుండా మళ్లీ రైతుల గుండె బరువెక్కించింది. మండలంలోని ఏడిద, కేశవరం, పాలతోడు, వెలగతోడు, ద్వారపూడి, జెడ్ మేడపాడు గ్రామాలతో పాటు, మండపేటలోను కుండపోత కురిసింది. ఓవైపు హోరుగాలులు, మరోవైపు భారీ వర్షం రైతులకు నష్టాన్ని మిగిల్చింది. ఏడిదలోని సంగమేశ్వర దేవాలయానికి వెళ్లే దారిలో సుమారు మూడు కిలోమీటర్ల మేర రైతులు ధాన్యాన్ని ఆరబోసుకున్నారు. గాలివాన రావడంతో రైతులు ఎటూ తప్పుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఆ రహదారిలో 50 ఎకరాలకు పైగా రైతులు తమ ధాన్యాన్ని ఆరబోత చేపట్టారు. రైతు మేకా నారాయణరావు 12 ఎకరాలు, తోకల శ్రీను 10, మేడిశెట్టి శ్రీనివాసరావు 3, మట్టపర్తి సత్యనారాయణ 3, మేకా శ్రీనివాసరావు 15 ఎకరాల ధాన్యాన్ని ఆరబోయగా, మరోరైతు సత్యంగారి అబ్బాయి 2 ఎకరాల ధాన్యాన్ని ఆరబోశారు. భారీ వర్షానికి రహదారి పొడవునా ధాన్యం తడిసి ముద్దయింది. ధాన్యం నిండా వర్షపు నీరు చేరడంతో చేసేది లేక రైతులు రాశులు కట్టి, బరకాలు కప్పారు. ఇదిలా ఉండగా, హోరుగాలికి ఏడిదలో పలుచోట్ల చెట్లు కూలిపోయాయి. సంగంరోడ్డులో కొబ్బరిచెట్టు పడగా, జమ్మి చెట్టు వీధిలో అనుకుల నగేష్ ఇంటి ఆవరణలో కొబ్బరి చెట్టు పెంకుటిల్లుపై పడింది. బొమ్మల గుడి వీధిలో చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడటంతో, స్తంభం విరిగిపోయింది. తీగలు రోడ్డు మీద పడ్డాయి. ముందుజాగ్రత్తగా అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు.



పెంకుటింటిపై కూలిన కొబ్బరి చెట్టు



ఒరిగిపోయిన విద్యుత్ స్తంభం

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కపిలేశ్వరపురం: రుణాలు, ప్రభుత్వ పథకాల్లో సబ్సిడీతో కూడిన ఆర్థిక సాయం పొందేందుకు ఎస్సీ కార్పొరేషన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఎంపీడీఓ కె.రత్నకుమారి మంగళవారం తెలిపారు. httpr://apobmmr.apcfrr.in వెబ్‌సైట్ ద్వారా మే 10లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఎస్సీ సామాజికవర్గానికి చెందిన, 21–50 ఏళ్లున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రవాణా రంగంలో రుణాన్ని ఆశించే అభ్యర్థులు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని చెప్పారు. జనరిక్ ఫార్మసీ పథకాలకు డీ-ఫార్మసీ, బీ-ఫార్మసీ, ఎం.ఫార్మసీల్లో ఏదో ఒక అర్హత ఉండాలన్నారు. ఫోన్ నంబరు లింక్ ఉన్న ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ, డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

కాజులూరు: మండల గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులందరూ ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో జె.రాంబాబు అన్నారు. మంగళవారం కాజులూరులో ఆయన మాట్లాడుతూ దరఖాస్తుల స్వీకరణకు వెబ్‌సైట్ ప్రారంభమయిందన్నారు. లబ్ధిదారులు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కుల ధ్రువీకరణ పత్రం కలిగిన వారై ఉండాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారై 21 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. దారిద్ర్యరేఖకు దిగువ కేటగిరీకి చెందిన వారై ఉండాలన్నారు. జనరిక్ ఫార్మసీ పథకాలకు దరఖాస్తులు చేసుకునేవారు డీ–ఫార్మసీ, బీ–ఫార్మసీ, ఎం–ఫార్మసీ చేసి ఉండాలని, స్వయం ఉపాధి పథకాల రవాణా రంగానికి లబ్ధిదారుడు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. మే 10వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు మండల పరిషత్, గ్రామ సచివాలయాల్లో సంప్రదించవచ్చని ఎంపీడీఓ తెలిపారు.

నేలకొరిగిన వరి చేలు

అకాల వర్షంతో రైతుల ఆందోళన



అంగరలో నేలకొరిగిన వరి చేను

కపిలేశ్వరపురం: మరో మూడు వారాల్లో పంట చేతికొస్తుంది. వరి కంకుల నిండా గింజలు రావడంతో రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రతి గింజనూ ఒడిసిపట్టి, కష్టాల నుంచి బయటపడవచ్చన్న ఆశలో రైతులున్నారు. ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి సాయం లేకపోయినా.. శ్రమనే నమ్ముకుని సాగు చేశారు. నిండుగా పంట పండిందన్న ఆనందంలో ఉన్న అన్నదాతకు మంగళవారం ఉన్నట్టుండి కురిసిన అకాల వర్షం కన్నీటిపాలు చేసింది. మండపేట నియోజకవర్గంలో సుమారు అరగంట పాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి వరి చేలు ప్రభావితమయ్యాయి. మండపేట నియోజవర్గంలోని మొత్తం 41 గ్రామాల్లో 45,550 ఎకరాల్లో వరిని సాగు చేస్తున్నారు. మండపేట మండలంలోని 12 గ్రామాల్లో 15,200 ఎకరాలు, రాయవరం మండలంలోని 12 గ్రామాల్లో 14,580 ఎకరాల్లో, కపిలేశ్వరపురం మండలంలోని 17 గ్రామాల్లో 15,770 ఎకరాల్లో సాగు జరుగుతోంది.

అకాల వర్షంతో ఇక్కట్లు

మంగళవారం మధ్యాహ్నం ఆకాశంలో ఉరుములు, మెరుపులతో సుమారు అర గంట పాటు వర్షం ధారాళంగా కురిసింది. కపిలేశ్వరపురం మండలంలోని అంగర, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, నల్లూరు, వెదురుమూడి, టేకి, మండపేట, ఏడిద, ఏడిద సీతానగరం, సావరం, కొత్తూరు తదితర గ్రామాల్లోని వరి చేలు వర్షానికి నీట మునిగింది. సుమారు ఐదు శాతం వరి చేలల్లోని వరి కంకులు నేలమట్టమయ్యాయి. అర గంట మాత్రమే కురిసిన వర్షానికి పంట తీవ్ర ప్రభావితం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు మరో రెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉన్నట్టు సమాచారం. వర్షాలు కొనసాగితే తాము తీవ్రంగా నష్టపోతామంటూ రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.